ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 28.0
కనిష్ఠం 23.0
ANDHRAJYOTHY


యాదాద్రి భువనగిరి
5
సోమవారం 20 అక్టోబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588.40 (307.2834)	54,305	54,305
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.55 (4.34)	1,912.14	1,448.88
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.948 (44.1326)	35,723	29,723

చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250





నేడు దీపావళి

» లక్ష్మీ పూజ, రేపు నోములు » అంతటా పండుగ సందడి

భువనగిరి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెలుగు పూల పండుగ దీపావళి సందడి నెలకొంది. సోమవారం లక్ష్మీపూజ, మంగళవారం కేదారీశ్వరి నోములు, సత్యనారాయణ స్వామి వ్రతాలను జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. పలువురు ఇళ్లలో బొమ్మల కొలువులు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆలయాలు, దుకాణాలను విద్యుత్ దీపాలు, బంతి పూలతో అలంకరించారు. రహదారుల వెంట బంతిపూలు, మట్టి ప్రమిదలు, బొమ్మలు విక్రయిస్తున్నారు. పలు ప్రాంతాల్లో బాణాసంచా దుకాణాలు ఏర్పాటయ్యాయి. పలువురు పట్టణాల నుంచి సొంత ఊర్లకు వెళ్తుండడంతో రహదారులపై ట్రాఫిక్ పెరిగింది. బస్సులు కిక్కిరిసి ప్రయాణిస్తున్నాయి. జిల్లా అంతటా దీపావళి సందడి నెలకొంది. జిల్లా కేంద్రం భువనగిరిలోని రైతుబజార్, వినాయక చౌరస్తా, కుండల బజార్, తదితర ప్రాంతాల్లో బంతిపూలు, పూజాసామగ్రి విక్రయాల సందడి నెలకొంది. అలాగే జిల్లా అంతటా సదర్ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి.











కమ్యూనిస్టులు

పురోగమన శక్తులు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

సమ్మేళనంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

రామన్నపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో పెట్టుబడిదారీ విధానంతో ప్రజల్లో అసమానతలు పెరుగుతాయని, ప్రజలకు కనీస అవసరాలు కల్పించాలని, పాలక విధానాలకు వ్యతిరేకంగా యువత ఉద్యమించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక మండల కేంద్రంలో నిర్వహించిన యువ కమ్యూనిస్టుల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టులు పురోగామి శక్తులుగా అవతరిస్తున్నారని, శ్రీలంక వంటి పరిణామాలే అందుకు నిదర్శనమన్నారు. ప్రజల కోసం ప్రాణాల ను తృణప్రాయం చేసి పోరాడుతోంది కమ్యూనిస్టులే అని, ప్రజా సమస్యలపై పోరాడిన చరిత్ర బీజేపీకి లేదన్నారు. స్వాతంత్ర్య ఉద్యమానికి ద్రోహం చేసి నేడు దేశభక్తులుగా అబద్ధపు ప్రచారం చేస్తున్న ఆర్ఎస్ఎస్‌ను యువత తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సమాజంలో అంతరాలు, అసమానతలపై యువ కమ్యూనిస్టులు సంఘటితంగా పోరాడాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ మాట్లాడుతూ, దోపిడీ వ్యవస్థపై యువత ప్రశ్నించకుండా, పోరాడకుండా ఉంటే సమాజం తిరోగమనంలోకి వెళ్తుందన్నారు. బీజేపీ మనువాదం, మతోన్మాదం పేరుతో ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టి విభజన రాజకీయాలు చేస్తోందన్నారు.తొలుత రామన్నపేటలో బైక్ ర్యాలీ నిర్వహించి అమరులకు నివాళులర్పించారు. పార్టీ పతాకాన్ని తమ్మినేని ఆవిష్కరించారు.కార్యక్రమంలో నాయకులు మేక అశోక్‌రెడ్డి, జల్లెల పెంటయ్య, సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేషం, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశం, బలుగూరి అంజయ్య, వనం ఉపేందర్, కూరెళ్ళ నర్సింహాచారి, బోయిని ఆనంద్, కందుల హనుమంతు, కల్లూరి నాగేష్, గొరిగే సోములు, నాగటి ఉపేందర్,గన్నేబోయిన విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.










పోలీస్ అమరులకు వెండి స్థూపంతో నివాళి



భువనగిరి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భువనగిరికి చెందిన స్వర్ణకారుడు చొల్లేటి శ్రీనివాసాచారి పోలీస్ అమరవీరులకు నివాళిగా వెండితో స్థూపం రూపొందించాడు. ఈ నెల 21న పోలీస్ అమరుల స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకొని 4తులాల వెండితో ఏడు రోజులు శ్రమించి నాలుగు అంగుళాల ఎత్తయిన స్థూపాన్ని రూపొందించాడు. ఆయన ప్రతిభను పలువురు పోలీసులు అభినందించారు.







ఇద్దరు పీహెచ్‌సీ ఉద్యోగుల సస్పెన్షన్

తుర్కపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రోగికి కాలం చెల్లిన మందులు ఇచ్చిన ఘటనకు సంబంధించి ఫార్మసీ ఆఫీసర్ మహేశ్వరీ(అవుట్ సోర్సింగ్), నర్సింగ్ ఆఫీసర్ రజిత(ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్)ను సెస్పెండ్ చేస్తూ కలెక్టర్ హనుమంతరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని వాసాలమర్రి గ్రామానికి చెందిన తొలిచుక్క అంజయ్య ఈనెల 18న పీహెచ్‌సీకి రాగా, అతడికి డాక్టర్ రుచిరారెడ్డి మందులు రాసిచ్చారు. ఆ చీటీని తీసుకొని మెడికల్ స్టోర్‌కు వెళ్లగా, ఎక్స్‌పైరీ డేట్‌ను పరిశీలించకుండా మందులు ఇచ్చి పంపారు. అంజయ్య ఇంటికి వెళ్లగా ఆ మందులను కుటుంబ సభ్యులు పరిశీలించి ఎక్స్‌పైరీ అయినవి ఇచ్చారని గుర్తించి పీహెచ్‌సీ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించారు. దీనిపై అందిన నివేదిక ప్రకారం విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మహేశ్వరి, రజితను సస్పెండ్‌చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

పైసల్లేక ఏడాదిన్నరాయె!

» ఉపాధి కార్యాలయాల నిర్వహణ ఎలా? » ఉమ్మడి జిల్లాలో 73 ఉపాధి కార్యాలయాలు » నెలనెలా ఖర్చులు భరించలేక సతమతమవుతున్న ఏపీవోలు » వేతనాలు అందక ఇబ్బందిపడుతున్న సిబ్బంది

6

ఊరూరా దీపావళి సందడి

చెడుపై మంచి సాధించే విజయాన్ని సూచించే దీపావళి పండుగకు జిల్లా ముస్తాబైంది. పూలు, ప్రమిదలు, టపాసుల కొనుగోలుతో మార్కెట్లు సందడిగా మారాయి. వరుస సెలవులతో జాతీయ రహదారిపై వాహనాల రద్దీ నెలకొంది. లక్ష్మీనృసింహుడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో యాదగిరిగుట్ట ఆలయం కిటకిటలాడింది. పండుగ నిర్వహణకు స్వస్థలాలకు చేరటంతో బంధుమిత్రుల పలకరింపులు, చిన్ననాటి స్నేహితుల ముచ్చట్లతో పల్లెలు కోలాహలంగా మారాయి.


నల్లగొండలో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు


సూర్యాపేటలో టపాకాయలు కొనుగోలు చేస్తున్న యువత


నలగొండ చర్లపల్లిలో...


యాదగిరీశుడి సన్నిధిలో భక్తుల కోలాహలం






నల్లగొండలో


భువనగిరిలో గుమ్మడికాయలు కొనుగోలు చేస్తున్న స్థానికులు


సూర్యాపేటలో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు


భువనగిరిలో విక్రయానికి సిద్ధంగా ఉన్న ప్రమిదలు

జాగ్రత్తలు వహిస్తే ఆనంద దీపావళి

పండుగ వేళ విషాదాలకు తావు ఇవ్వవద్దు

కాలుష్య రహితానికే ప్రాధాన్యం ఇవ్వాలి



సూర్యాపేటటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళిని ప్రతీఇంట్లో సంతోషాలతో నిర్వహిస్తారు. అయితే బాణాసంచా కాల్చేప్పుడు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా పండుగ నిర్వహించవచ్చు. టపాసులు కాల్చేప్పుడు కళ్లకు గాయాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కొంత మందికి దురదలు వస్తాయి. మరి కొందరికి కార్నియారాపిడి, రెటినల్ సమస్యలు ఏర్పడి, నిర్లక్ష్యం చేస్తే అంధత్వానికి దారితీసే ప్రమాదం ఉంది. అంతేగాక పొగ కారణంగా స్వరపేటిక వాయడం, గొంతు ఇన్‌ఫెక్షన్ తలెత్తే ప్రమాదం ఉంది. టపాసులు కాల్చేటప్పుడు కళ్లద్దాలు ధరించడం శ్రేయస్కరం. ఒక గజం దూరం నుంచి టపాసులు కాల్చడం ఉత్తమం. కనీసం 5 మీటర్ల నుంచి వీక్షించాలి. కాంటాక్ట్ లెన్స్ ఉంటే తీసేయాలి. టపాసులు కాల్చాక పరిశుభ్రమైన నీటితో చేతులు కడుక్కోవాలి.

కాల్చేటప్పుడు ఏం చేయాలి

బాణాసంచాల కొనుగోలుచేసేటప్పుడు నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి. పిల్లలు టపాసులు కాల్చేప్పుడు పెద్దలు వారికి అతి సమీపంలో ఉండి తగిన జాగ్రత్తలు చెప్పాలి. డోర్ కర్టెన్లు, దుస్తులు ఉన్న చోట దూరంగా కొవ్వొత్తులు వెలిగించాలి. ప్రాథమిక చికిత్స కిట్‌ను అందుబాటులో ఉంచుకోవాలి. చాలా మంది యువకులు బాణాసంచాలను, చిచ్చుబుడ్లు, భూచక్రాలను చేతిలోనే కాల్చాలని అనుకుంటారు.

అలాంటి సాహసాలకు పూనుకుంటే ప్రమాదాలను కొనితెచ్చుకున్నట్లే. కాల్చి న టపాసులను నలిపివేయడం, వాటిపై నీరు పోయడం, మట్టిని చల్లడం చేయాలి. సగం కాలిన టపాసులను వదిలేయకుండా నీళ్ల బకెట్లలో వేస్తే మంచిది. సోషల్ మీడియాలో ఫొటోలు పెట్టాలనే ఉత్సాహంతో టపాసులు కాలుస్తూ సెల్ఫీలకు ప్రయత్నించకూడదు. టపాసులు కాల్చేటప్పుడు సింథటిక్ దుస్తులు ధరించకూడదు.

త్యాగధనుల స్మృతిలో..

- విధి నిర్వహణలో అసువులు బాసిన రక్షక భటులు
- నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- గుట్ట పోలీస్‌స్టేషన్ పేల్చి 28 ఏళ్లు

అంకితభావంతో పనిచేయడమే వారి లక్ష్యం. విధి నిర్వహణలో ప్రాణాల్ని సైతం లెక్కచేయకపోవడం వారి నైజం. సమాజ రక్షణకు అహర్నిషలు కృషి చేస్తూ.., రాత్రనక, పగలనక అసాంఘిక శక్తులతో పోరాడుతున్న పోలీసుల త్యాగం వెలకట్టలేనిది.

- (ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)


వంగపల్లిలో అనాథ వృద్ధురాలికి ఆహార పదార్థాల కిట్టును అందజేస్తున్న ఏసీపీ, సీఐ (ఫైల్)

ఆపదైనా, అత్యవసరమైనా క్షణకాలంలో ఎదుట నిలిచి ఆపన్నహస్తం అదించే గురుతర బాధ్యతను పోలీసులు నిర్వహిస్తున్నారు. హింసను అరికట్టడం, నేరాలను తగ్గించడం, మత్తు పదార్థాల వంటి సమస్యలను నివారించడంలో పోలీసులు పోరాటం చేస్తూనే ఉంటారు. ఈ అసాంఘిక శక్తులపై పోరాటంలో ప్రాణాలను కోల్పోయిన పోలీసులు ఎందరో. తమ కుటుంబాలను సైతం వదిలి సమాజ రక్షణ కోసం నిరంతరం పాటుపడే పోలీసుల త్యాగాలను స్మరించుకొనే రోజే అక్టోబరు 21. పోలీసుల అమరుల త్యాగాల గుర్తుచేసుకొనే ఈ రోజుకు ఎంతో ప్రత్యేకత ఉంది.

సామాజిక సేవలోనూ పోలీసుల పాత్ర

ఓ వైపు శాంతి భద్రతలను పరిరక్షిస్తూ పట్టణంలో అనాథలై వీధుల్లో భిక్షాటన చేస్తున్న వృద్ధులకు పోలీసులు అండగా నిలుస్తున్నారు. రాచకొండ సీపీ ఆదేశాల మేరకు మరోవైపు యాదగిరిగుట్ట సబ్‌డివిజన్ ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు పర్యవేక్షణలో స్థానిక సీఐ బొడ్డుపల్లి భాస్కర్, పోలీస్ సిబ్బంది గుట్టలో వృద్ధులకు ఆర్థిక సహకారం, దుస్తులు, ఆహార పదార్థాలు అందజేస్తున్నారు. అనాథలుగా వదిలివేసిన వృద్ధులను వారి కన్నబిడ్డలు, కుటుంబ సభ్యులను పిలిపించి వారి వద్దకు చేర్పి పోషించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. యువత డ్రగ్స్, గంజాయి, మత్తుపదార్థాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌ల బారీన పడి జీవితాలు నాశనం చేసుకోకుండా, వారి కుటుంబాలు ఇబ్బందులకు గురికాకుండా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగహన సదస్సులు నిర్వహిస్తూ సమాజ రక్షణలో పోలీసులు కీలక భూమిక పోషిస్తున్నారు.


సమాజంలో పోలీసులు వ్యవస్థ లేకుంటే మనుగడ సాధించలేం..



సమాజంలో పోలీసు వ్యవస్థలేకుంటే మనుగడ సాధించలేం. గొడవలు, అల్లర్లు, కుటుంబ సమస్యలు, హత్యలు, రౌడీలను నివారంచడం , ఎన్నికల్లో ప్రతి విషయంలో పోలీసుల పాత్ర కీలకం. ప్రజలు శాంతియుతంగా కంటి నిండ నిద్రపోతున్నారంటే అందుకు పోలీసుల సేవలు అందుకు నిదర్శనం.

- భీమగాని నర్సింహగౌడ్, పెద్దకందుకూర్

అమరుల స్ఫూర్తితో ముందుకు వెళ్తాం



పోలీస్ అమరుల స్ఫూర్తితో ముందుకు వెళ్తాం. వారి త్యాగాల ను భావితరాలకు అందించడానికే పోలీస్ అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తున్నాం. శాంతిభద్రతలను కాపాడటంలో పోలీస్‌లు కీలకపాత్ర పోషిస్తున్నారు. కేవలం విధులు నిర్వహించడమే కాకుండా గంజాయి, డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై యువతకు అవగహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

- శ్రీనివాస్‌నాయుడు, యాదగిరిగుట్ట ఏసీపీ

యాదగిరిగుట్ట పోలీస్ అమరుల యాదిలో..

యాదగిరిగుట్ట పట్టణంలో 1998 జనవరి 17న నక్సలైట్లు పోలీస్‌స్టేషన్‌ను పేల్చివేసిన ఘటన జరిగి 28 ఏళ్లయింది. అప్పట్లో విధినిర్వహణలో ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లు, మిర్యాలగూడకు చెందిన వారి మిత్రుడు మృతి చెంది 28 ఏళ్లు పూర్తయింది. నాటి చేదు అనుభవాలు నేటికీ పోలీసులు మరువలేకపోతున్నారు. నాటి నుంచి నేటి వరకు ప్రతీ సంవత్సరం వారి యాదిలో నివాళి అర్పిస్తూ, వారిని స్మరించుకుంటున్నారు.

పైసల్లేక ఏడాదిన్నరాయే!



- ఉపాధి కార్యాలయాల నిర్వహణ ఎలా?
- ఉమ్మడి జిల్లాలో 73 ఉపాధి కార్యాలయాలు
- నెలనెలా ఖర్చులు భరించలేక సతమతమవుతున్న ఏపీవోలు
- వేతనాలు అందక ఇబ్బంది పడుతున్న సిబ్బంది

మోత్కూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కూలీలకు ఉపాధి చూపుతున్న ఎన్ఆర్ఈజీఎస్ (జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం) కార్యాలయాలకు ప్రభుత్వం నుంచి నిర్వహణ ఖర్చులు అందడం లేదు. దీంతో ఏపీవో (అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్)లు నానా తంటాలు పడుతున్నారు. ప్రతీ నాలుగు నెలలకోసారి అందాల్సిన నిర్వహణ ఖర్చులు ఏడాదిన్నర (నాలుగు విడతలు)గా అందకపోవడంతో పలువురు ఏపీవోలు అప్పులు చేసి కార్యాలయాలను నడుపుతున్నారు. వచ్చే వేతనమే నెలనెల సకాలంలో అందక, చాలీచాలని వేతనంతో ఇంటి ఖర్చులకే ఇబ్బందిపడుతున్న ఏపీవోలకు కార్యాలయాల నిర్వహణ అదనపు భారమైంది.

తప్పని నిర్వహణ ఖర్చులు..

ఉపాధి కార్యాలయాల్లో ప్రతీ రోజు స్టేషనరీ అవసరముంటుంది. నెలనెలా కరెంటు బిల్లు, ఇంటర్‌నెట్ బిల్లు చెల్లించాలి. సమావేశాలు నిర్వహించినప్పుడు చాయ్, బిస్కట్లు, కంప్యూటర్, ప్రింటర్ రిపేర్‌కొస్తే బాగు చేయించడం తప్పదు. ఒక్కో కార్యాలయానికి మండలంలోని గ్రామాలు, కూలీలను బట్టి రూ.3వేలనుంచి రూ.3,500 వరకు స్టేషనరీ, నెలకు సుమారు రూ.1500 వరకు కరెంటు బిల్లు, సుమారు రూ.వెయ్యి వరకు ఇంటర్‌నెట్ బిల్లు చెల్లించడంతో పాటు ఇతర ఖర్చులు భరించాల్సిందే.

నాలుగు కేటగిరీలుగా నిర్వహణ ఖర్చుల కేటాయింపు..

కేంద్ర ప్రభుత్వం కూలీల పని దినాల ఆధారంగా కార్యాలయాలకు నిర్వహణ ఖర్చులు కేటాయిస్తుంది. రాష్ట్రంలోని ఉపాధి హామీ కార్యాలయాలను నాలుగు కేటగిరీలుగా విభజించి నిర్వహణ ఖర్చులు నిర్ణయించింది. నిర్వహణ ఖర్చులు ఏడాదికి మూడు విడతలుగా ప్రతీ నాలుగు నెలలకోసారి చెల్లించాలి. లక్ష కన్నా తక్కువ పనిదినాలు ఉన్న కార్యాలయాలకు రూ.60 వేలు, వీటిని మొదటి విడత రూ.30వేలు, మిగతా రెండు విడతలు రూ.15వేల చొప్పున చెల్లిస్తారు. లక్ష నుంచి రెండులక్షల పనిదినాలు ఉన్న కార్యాలయాలకు రూ.75వేలు, వీటిని మొదటి విడత 37,500, మిగతా రెండు విడతలు రూ.18,750 చొప్పున, రెండు లక్షల నుంచి మూడు లక్షల పనిదినాలు ఉన్న కార్యాలయాలకు రూ.85వేలు, వీటిని మొదటి విడత రూ.42,500, మిగతా రెండు విడతలు రూ.21,250 చొప్పున, మూడు లక్షల కన్నా ఎక్కువ పనిదినాలు ఉన్న కార్యాలయాలకు రూ.లక్ష, వీటిని మొదటి విడత రూ.50వేలు, మిగతా రెండు విడతలు రూ.25వేల చొప్పున చెల్లిస్తారు.

ఏపీవోలకు వచ్చే వేతనమే తక్కువ

ఉపాధి హామీ కార్యాలయాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఏపీవోలు రెగ్యులర్ కాలేదు. వారు ఎఫ్‌టీఈలు (ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిస్)గా కొనసాగుతున్నారు. వారికి వారి సీనియార్టీని బట్టి నెలకు రూ.44వేల నుంచి రూ.56వేల వేతనం అందుతుంది. వారికి మూడేళ్లుగా టీఏ, డీఏ సౌకర్యం రద్దుచేశారు. వారు ఫీల్డ్‌కు వెళ్లినా, సమావేశాలకు ప్రధాన కార్యాలయానికి వెళ్లినా సొంత ఖర్చులతో వెళ్లాల్సిందే.

వేతనాలు అందక ఇబ్బంది పడుతున్న సిబ్బంది

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలు, ఏపీవోలు, టీఏలకు ఒక నెల, అటెండర్‌కు 5నెలలు, ఔట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్లకు 2నెలల వేతనాలు రావాల్సి ఉంది. బతుకమ్మ, దసరా పండుగలను సైతం అప్పుచేసి జరుపుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కార్యాలయాల నిర్వహణ ఖర్చులు, పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏపీవోలు, ఉపాధి సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.

తగ్గిన పనిదినాలు

కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీల పనిదినాలు ఏడాదికింత తగ్గిస్తోంది. కరోనా కాలంలో 2021-22లో రాష్ట్రంలో 14.25 కోట్ల పనిదినాలు ఉండగా, 2022-23లో 11 కోట్లకు, 2023-24లో 10.50 కోట్లకు తగ్గించింది. 2024-25లో 12కోట్లకు పెంచిన పని దినాలను 2025-26లో 6.50 కోట్లకు తగ్గించింది.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 73 ఉపాధి కార్యాలయాలు...

యదాద్రి భువనగిరి జిల్లాలో 17, సూర్యాపేట జిల్లాలో 23, నల్లగొండ జిల్లాలో 33 ఉపాధి హామీ కార్యాలయాల చొప్పున ఉమ్మడి జిల్లాలో 73 ఉపాధి కార్యాలయాలున్నాయి. రాష్ట్రంలో లక్ష కన్న తక్కువ పని దినాలు ఉన్న కార్యాలయాలు 43, రెండు లక్షలలోపు పనిదినాలు ఉన్న కార్యాలయాలు 191, మూడు లక్షలలోపు పని దినాలు ఉన్న కార్యాలయాలు 185, మూడు లక్షలకు పైన పనిదినాలు ఉన్న కార్యాలయాలు 120 ఉన్నాయి. ఈ ఉపాధి హామీ కార్యాలయాలకు 2024-25 ఏడాదికి మూడు విడతలు, 2025-26 సంవత్సరంలో మొదటి విడత కలిపి మొత్తం రూ.6,69,4500 నిర్వహణ ఖర్చులు చెల్లించాల్సి ఉంది.

పండుగకు వచ్చి పరలోకానికి...

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. పీఏపల్లి, కేతేపల్లి, నార్కట్‌పల్లి మండలాల్లో ఒక్కొక్కరు చొప్పున దుర్మరణం చెందారు.

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పండుగకు వచ్చిన యువకుడు పరలోకానికి వెళ్లాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొని బీటెక్ విద్యా ర్థి మృతి చెందాడు. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిలోని ఘనపురం స్టేజీ సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు, స్థా నికుల తెలిపిన వివరాల ప్రకారం... గుడిపల్లి మండలం కోదండపురం గ్రా మానికి చెందిన ఫైనం అర్జున్ రాంప్రసాద్ (23) హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేసి కోచింగ్ తీసుకుంటున్నాడు. దీపావళి పండుగ కు స్వగ్రామం గుడిపల్లి మండలం కోదండపురం గ్రామానికి వస్తున్నాడు. కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిలోని ఘనపురం శివారులో గుర్తు తెలియని వాహనం అర్జున్ స్కూటీని ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన అర్జున్ రాంప్రసాద్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీంతో కోదండపురం గ్రామంలో విషాదఛాయ లు అలుముకున్నాయి. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న గుడిపల్లి పోలీసులు దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. అనంతరం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.


అర్జున్ రాంప్రసాద్ (ఫైల్‌ఫొటో)

ద్విచక్ర వాహనాలు ఢీకొని ...

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి-అద్దంకి రాష్ట్ర రహదారిపై నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు శివారు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి గ్రామస్థులు తెలిసిన వివరాల మేరకు... చెర్వుగట్టుకు చెందిన మేకల వెంకట్‌రెడ్డి (58) తన వ్యవసాయ బావి వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్లి వస్తున్నాడు. అదే దారిలో నార్కట్‌పల్లి వైపునకు వస్తున్న దిచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన మేకల వెంకట్‌రెడ్డిని హుటాహుటిన నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు వెంకట్‌రెడ్డి గతంలో చెర్వుగట్టు దేవస్థానం ధర్మకర్తగా పనిచేశారు. వెంకట్‌రెడ్డి అకాల మృతి పట్ల పలువురు నాయకులు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, మేకల అరుణరాజిరెడ్డి, మల్గ బాలకృ ష్ణ, రేగట్టె నర్సిరెడ్డి, కమ్మంపాటి వెంకటయ్య, నేతకాని కృష్ణయ్య, వారాల రమేష్, పున్నంరాజు యాదగిరి, రేగట్టె రాజశేఖర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, మల్గ శంకర్ తదితరులు సంతాపం తెలిపారు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నాడు. ఈ సంఘటనపై ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.


మేకల వెంకట్‌రెడ్డి (ఫైల్)

కారు ఢీకొని ఒకరు...

కేతేపల్లి: నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామ శివారులో 65వ నెంబరు జాతీయ రహదారిపై గల వైజంక్షన్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇనుపాముల గ్రామానికి చెందిన పాశం రాంరెడ్డి (48) నకిరేకల్ వైపు నుంచి ఇనుపాముల వైపున హైవే వెంట ఉన్న తన ఇంటికి వెళ్లేందుకు వై జంక్షన్‌లో కాలినడకన రోడ్డు దాటుతున్నాడు. ఇదే సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న టవేరా వాహనం రాంరెడ్డిని ఢీకొట్టింది. దీంతో రాంరెడ్డి తలకు బలమైన గాయాలతో పాటు ఒక చేయి, ఒక కాలు విరిగాయి. తీవ్రంగా గాయపడిన రాంరెడ్డిని బంధువులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ వివరించారు.

దుబాయ్‌కి వెళ్తున్నానంటూ బలవన్మరణం

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): 'దుబాయ్‌కు వెళ్తున్నాను. మూడు నెలల వరకు తిరిగి రాను' అంటూ ఇంట్లో చెప్పిన ఓ యువకుడు నగర శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవాడిపల్లి గుట్టల ప్రాంతంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా ఎర్కారం గ్రామానికి చెందిన బొర్ర నరేష్ కాలుష్య తనిఖీ వాహనంలో పనిచేస్తూ నగరంలోని రాయదుర్గం షేక్‌పేటలో నివాసం ఉంటున్నారు. గత నెల సెప్టెంబరు 29వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అతను సోదరుడికి ఫోన్ చేసి దుబాయ్ వెళ్తున్నానని మూడు నెలల వరకు రానంటూ చెప్పాడు. అనంతరం అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. మరుసటి రోజు అతడి సోదరుడు రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టాడు. అయితే అతడు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవాడిపల్లి గుట్టల్లో తాడుతో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అబ్దుల్లాపూర్‌మెట్ పో టలీసులకు శనివారం ఉదయం సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. సెల్ నెంబర్ లభించిన ఆధారాలతో మృతుడి వివరాలు సేకరించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏఎన్‌ఎం కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

• సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం



రాస్తారోకోలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, ఏఎన్‌ఎంలు

రామన్నపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఎన్‌ఎం సుజాత కుటుంబానికి ప్రభుత్వం రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం డిమాండ్‌చేశారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన సుజాత మృతదేహానికి రామన్నపేట ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. సుజాత మృతదేహంతో ప్రధాన రహదారిపై నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు, సీఐటీయూ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలకు వాగ్వా దం జరిగింది. జిల్లా వైద్యాధికారితో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో గొరిగె సోములు, తుర్కపల్లి సురేందర్, కందుల హన్మంతు, అప్పం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో పారదర్శకత ఉండాలి

• డీఆర్‌డీవో గుర్రం సురేష్ • తుర్కపల్లిలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ • కొలతల్లో తేడాలు.. రికవరీకి ఆదేశం

తుర్కపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో పారదర్శకత పాటించాలని డీఆర్‌డీవో గుర్రం సురేష్ అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు సామాజిక తనిఖీ నిర్వహించారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వరకు చేపట్టిన పనుల నివేదికలు చదివి వినిపించారు. మండలంలోని 31 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద భూమి అభివృద్ధి పనులు, నీటి కుంటల నిర్మాణం, మట్టి రోడ్లు, పండ్ల తోటలు, వన మహోత్సవం, రాతి కట్టడాలు, పశువుల పాకలు తదితర వంటి 419 పనులు చేపట్టారు. ఈ పనులకు రూ.5,36,51,194 ఖర్చు చేయగా, ఇందులో సామగ్రి కోసం రూ.4,99,96,026, కూలీలకు రూ.36,55,168 చెల్లించారు. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్లు, శ్మశాన వాటిక పనులు చేపట్టేందుకు రూ.1,96,82,925 ఖర్చు చేయగా, ఇందులో కూలీలకు రూ.10,928, మెటీరియల్ కింద రూ.1,96,32,925 చెల్లించారు. అధికారులు నిర్వహించిన ప్రజావేదికలో డీఆర్‌పీలు గ్రామ సభల్లో వినిపించిన నివేదికలను సామాజిక తనిఖీలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో చేపట్టిన పనుల్లో కొలతల్లో వచ్చిన తేడాలకు రూ.3వేలు టీఏల ద్వారా రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి మందడి ఉపేందర్‌రెడ్డి, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, అంబుడ్స్‌పర్సన్ వీరమల్లు, విజిలెన్స్ మేనేజరు ఆదిత్యవర్ధన్, షఫియొద్దీన్, ఎంపీవో డి.వెంకటేశ్వర్లు, ఏపీవోలు ఎర్ర నారాయణ, ఎల్.నర్సయ్య, పీఆర్ ఏఈ చక్రధర్, ఎస్ఆర్‌పీ గోవింద్ కాశన్న, ఈసీ యశోద తదితరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

దళారులకు విక్రయించి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకట్రామ్‌రెడ్డి

వలిగొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దని అరూరి పీఏసీఎస్ చైర్మన్ చిట్టెడి వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని అరూరు జంగారెడ్డిపల్లి, అప్పారెడ్డిపల్లి, గంగాపురం, గురునాథ్‌పల్లి, వెంకటాపురం, ముత్యాపురం, చిట్టాపురం గోపరాజుపల్లి, మొగిలిపాక గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ భీమానాయక్, మాజీ ఎంపీపీలు నూతి రమేష్‌రాజు, చిట్టెడి జనార్ధన్‌రెడ్డి, నాయకులు వాకిటి అనంత్‌రెడ్డి, బద్దం సంజీవరెడ్డి, సుక్కపల్లి సురేందర్, కీసరి రాంరెడ్డి, కాసుల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, ఎంపీడీవో రాములు అన్నారు. మండలంలోని దుబ్బాక, మునిపంపుల, పల్లివాడ, ఎన్నారం గ్రామాల్లో ఆదివారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ అంబటి ఉపేంద్రమ్మ, రవీందర్‌రెడ్డి, డైరెక్టర్ కల్లూరి సైదమ్మ, నగేష్, నాగు అంజయ్య, కొండల్‌రెడ్డి, సీఈవో జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపఎన్నిక ప్రచారంలో చింతల



ప్రచారం నిర్వహిస్తున్న చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

భువనగిరి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భువనగిరికి చెందిన బీఆర్‌ఎస్ రాష్ట్రనేత చింతల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం విస్తృతంగా ప్రచారంచేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపిస్తే రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు వస్తాయన్నారు. ఓటర్లను కలిసి గత బీఆర్‌ఎస్, నేటి కాంగ్రెస్ పాలన వ్యత్యాసాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆయనవెంట పలువురు నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి : కేటీఆర్



కేటీఆర్‌కు నృసింహుడి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న చంద్రయ్య

భువనగిరి రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ సత్తా చాటే విధంగా కార్యకర్తలు సైనికుల వలె పని చేయాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఆదివారం మండలంలోని వడాయిగూడెం బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు జక్కుల చంద్రయ్య కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహ స్వామి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యపరుస్తూ వచ్చే జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులు గెలిచే విధంగా కార్యకర్తలు పని చేయాలని కేటీఆర్ వెల్లడించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే రాగిని లక్ష్మారెడ్డి, గంధం నాగేశ్వర్ రావు ఉన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): డీసీసీ (జిల్లా కాంగ్రెస్ కమిటీ) అధ్యక్ష పదవి కోసం భూదాన్‌పోచంపల్లికి చెందిన సీనియర్‌నేత తడక వెంకటేష్ ఆదివారం ఏఐసీసీ పరిశీలకుడు శరత్‌రౌత్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి సహకారంతో తమ నాయకుడికి అధ్యక్ష పదవి ఇవ్వాలని కాంగ్రెస్‌నేతలు కోరారు.

మోటకొండూరు: డీసీసీ పదవి జిల్లా కేంద్రానికి చెందిన పోత్నక్ ప్రమోద్ కుమార్‌కు ఇస్తేనే బీసీలకు గౌరవం దక్కుతుందని మాజీ సర్పంచ్ బుగ్గ శ్రీశైలం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

తుర్కపల్లి: డీసీసీ అధ్యక్ష పదవికి కాంగ్రెస్ తుర్కపల్లి మండల అధ్యక్షుడు ధనావతు శంకర్‌నాయక్ ఆదివారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ పరిశీలకుడు శరత్‌రౌత్, ఎమ్మెల్యే మట్ట నాగ రాగమయికి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. తాను గతంలో కాంగ్రెస్ యాదగిరిగుట్ట బ్లాక్ అధ్యక్షుడిగా, ప్రస్తుతం తుర్కపల్లి మండల అధ్యక్షుడిగా పని చేస్తున్నట్లు తెలిపారు.

మునిసిపల్ కమిషనర్‌గా సాయికృష్ణారెడ్డి

మోత్కూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మోత్కూర్‌కు చెందిన గుర్రం సాయి కృష్ణారెడ్డి మునిసిపల్ కమిషనర్‌గా ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించిన కొలువుల పండుగ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి నుంచి మునిసిపల్ కమిషనర్‌గా నియామకపత్రం అందుకున్నారు. సాయికృష్ణారెడ్డి గ్రూప్-2 ఫలితాల్లో రాష్ట్రస్థాయి 11వ ర్యాంకు సాధించారు.

కేంద్రమే రిజర్వేషన్లను ఆమోదించాలి

ఆలేరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కేంద్రమే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని బీసీ జేఏసీ ఆలేరు నియోజకవర్గ అధ్యక్షుడు పేరపు రాములు, నాయకులు ఆర్.జనార్ధన్, మొరిగాడి చంద్రశేఖర్, చెక్క వెంకటేష్ డిమాండ్‌చేశారు. ఆదివారం ఆలేరులో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టి తీర్మానించడం హర్షనీయమేనన్నారు. బంద్‌ను విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

కొండగడప వద్ద బస్సులు ఆపాలి

మోత్కూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మోత్కూరు పరిధిలోని కొండగడపవద్ద ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులు ఆపాలని గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేతలు కొప్పుల శ్రీధర్‌రెడ్డి, లెంకల వేణు ఆదివారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిప్రతం అందజేశారు. స్పందించిన మంత్రి డీఎంతో మాట్లాడి కొండగడప వద్ద బస్సులు ఆపిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

భువనగిరిని సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

భువనగిరి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం భువనగిరిని సుందర పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణ ప్రధాన రహదారి డివైడర్ మధ్యన పూలమొక్కలను నాటే పనులను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. భువనగిరి పట్టణం నలువైపులా విస్తరిస్తుందని, రూ.56కోట్లతో ఖిల్లా పనులు, రూ.500 కోట్లతో ఎంఎంటీఎస్ పనులు, త్వరలో ఆర్ఆర్ఆర్ పనులు ప్రారంభం కానుండడంతో భువనగిరి పట్టణానికి మహర్దశ రానుందన్నారు. అందుకు అనుగుణంగా భువనగిరి పట్టణంలో రూ.13.60కోట్లతో మౌలిక వసతుల పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అవేజ్ చిస్తీ, హెచ్‌ఎండీఏ డిప్యూటీ రేంజ్ అధికారి పీఎస్ నిఖిల్, మునిసిపల్ మాజీ చైర్మన్లు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్, పోత్నక్ ప్రమోద్‌కుమార్, కూర వెంకటేశ్, గుర్రాల శ్రీనివాస్, ఈరపాక నర్సింహ పాల్గొన్నారు.

సహస్ర దీప కాంతులతో పూజలు



హారతి ఇస్తున్న అర్చకుడు

భువనగిరి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పరిధిలోని స్వర్ణగిరిలో ఆదివారం వేంకటేశ్వరస్వామికి సహస్ర దీపకాంతులతో పూజలు జరిపారు. అర్చక స్వాములు వేద మంత్రోచ్ఛరణలతో మంగళహారతులు సమర్పించారు. నిత్య కల్యాణోత్సవం జరిపి ఆలయ వీధుల్లో ఊరేగించారు. సాంప్రదాయరీతిలో నిత్యారాధన నిర్వహించి తిరుసేవ జరిపారు. వారాంతపు రద్దీతో రోజంతా భక్తులతో స్వర్ణగిరి క్షేత్రం కిక్కిరిసింది.

స్వయం సేవకుల కవాతు

భువనగిరి రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అనంతారంలో ఆదివారం రాత్రి స్వయం సేవకులు కవాతు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా సేవకులు ధర్మ ధ్వజంతో గ్రామంలోని ముఖ్య కూడళ్లలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు, గ్రామస్థులు వివిధ రకాల పూలు వేస్తూ స్వయం సేవకులకు స్వాగతం పలికారు.

భక్తజన సంద్రం.. యాదగిరి క్షేత్రం

• లక్ష్మీనరసింహుల సన్నిధిలో భక్తుల సందడి • ఈ నెల 22 నుంచి కార్తీక వ్రతాలు



ప్రధాన ఆలయంలో భక్తుల రద్దీ, (ఇన్‌సెట్‌లో) స్వామివారు

యాదగిరిగుట్ట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుడి క్షేత్రం ఆదివారం భక్తజనసంద్రమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఉభయ దర్శన క్యూలైన్లు ఉదయంనుంచి రాత్రి వరకు రద్దీగా మారాయి. ప్రత్యేక దర్శనానికి గంట, ధర్మదర్శనానికి రెండు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనం, మధ్యాహ్నం రాజభోగం (ఆరగింపు) సమయాల్లో మూడు గంటలపాటు ఉభయ క్యూలైన్లల్లో భక్తులువేచి ఉండటంతో క్యూలైన్లు సందడిగా మారాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.28,85,315 ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జీ ఈవో గుగులోతు రవినాయక్ తెలిపారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట నృసింహ క్షేత్రంలో సుప్రభాత సేవతో లక్ష్మీనృసింహులను మేల్కొలిపిన అర్చకులు సంప్రదాయరీతిలో నిత్యపూజలు నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణపర్వాలు వైభవంగా చేపట్టారు. పాతగుట్టలోనూ స్వామిఅమ్మవార్లకు నిత్యపూజలు ఘనంగా చేపట్టారు. శివాలయంలో పర్వతవర్ధినిసమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్యపూజలు, రుద్రహవన పూజలు శైవాగమ రీతిలో జరిపారు. రాత్రి వేళ మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు.

లెస్టర్ నగరంలో స్వామి కల్యాణం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణం యూకే దేశంలో లెస్టర్ నగరంలో వైభవంగా నిర్వహించారు. స్వామివారి నిత్య కైంకర్యాల్లో భాగంగా సుప్రభాత సేవతో మొదలుకాగా ఆరాధన, సుదర్శన హోమం నిర్వహించారు.

నేడు సుప్రభాత సేవ రద్దు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో సుప్రభాత సేవ రద్దు చేస్తున్నట్లు ఇన్‌చార్జీ ఈవో గుగులోతు రవినాయక్ తెలిపారు. సోమవారం దీపావళి సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. వేకువజామున 3.30 గంటలకు ఆస్థానపరంగా సుప్రభాత సేవ, 4.15 నుంచి 4.45 గంటల వరకు ఆస్థాన మంగళహారతులు (భక్తులకు అనుమతి), 4.45 నుంచి 5.45 గంటల వరకు తిరువారధన, బాలభోగం (ఆరగింపు), 5.45 నుంచి 6.45 గంటల వరకు నిజాభిషేకం, 6.45 నుంచి 7.15 గంటల వరకు సహస్రనామార్చనతో పాటు యథావిధిగా ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈవో వివరించారు.



















కృత్రిమ కాళ్ల ఏర్పాటుకోసం శిబిరం

చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో ఈ నెల 26న ఉచిత కృత్రిమ కాళ్ల ఏర్పాటుకోసం పొద్దారు ఇంటర్నేషనల్ స్కూల్‌లో స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ పోలోజు శ్రీనివాస్ చారి తెలిపారు. లయన్స్ ఇంటర్నేషనల్, తెలంగాణ-అమెరికా తెలుగు సంయుక్త సంఘాల సహకారంతో నిర్వహించనున్నట్లు వివరించారు. పూర్తి వివరాల కోసం సెల్:8019957556ను సంప్రదించాలన్నారు.

ఆత్మరక్షణకు తైక్వాండో దోహదం

భువనగిరి రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు తైక్వాండో క్రీడలు దోహదపడుతాయని తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి కొండ్రెడ్డి శ్రీకాంత్ అన్నారు. ఆదివారం భువనగిరిలో తైక్వాండో అసోసియేషన్ క్రీడాకారులకు బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బెల్ట్‌లు ప్రదానంచేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఓరుగంటి రవికుమార్, కొండాపురం కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రైతుల సంక్షేమమే ధ్యేయం

● ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బ్రాహ్మణపల్లి, చిన్నరావులపల్లి గ్రామాల్లోని ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమంకోసం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి అండగా ఉంటుందని, ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,389, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2,369 మద్దతు ధర ఇస్తున్నామన్నారు. అలాగే సన్నాలకు రూ.500 బోనస్ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు గోళి పింగల్‌రెడ్డి, మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం బాలకృష్ణ గౌడ్, ఐకేపీ ఏపీఎం మీన, బాల్‌రెడ్డి, సురకంటి సత్తిరెడ్డి, ప్రభాకర్, శ్రీనివాస్ గౌడ్, నిఖిల్ రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాజాపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ప్రభుత్వవిప్ బీర్ల అయిలయ్య అన్నారు. ఆదివారం రాజాపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం రైతులనుద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రైతులకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. మండలంలోని కాల్వపల్లి గ్రామంలో గీత కార్మికుడు కల్లెపు రామస్వామి తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందడంతో ముందుగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ చింతలపురి భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్లు కాకల్ల ఉపేందర్, జెల్ల భిక్షపతి, అంజిరెడ్డి, మర్ల నాగరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు, సీతఃవో శేఖర్, నాయకులు మహేందర్‌గౌడ్, బుడిగె పెంటయ్య, గౌటె లక్ష్మణ్, ఇంజ నరేష్, శ్రీశైలం, నవీన్ పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి : యాదగిరి

సంస్థాన్‌నారాయణపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి పందుల యాదగిరి గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలకేంద్రంలో గీత పనివారల సంఘం 68వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించి, ధర్మ భిక్షం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దున్నేవానిదే భూమి, ఎక్కే వానిదే చెట్టు అనే నినాదంతో సంఘం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరమల్ల యాదయ్య, బొంగు చంద్రయ్య, బద్దం యాదయ్య, పాల కుర్ల యాదయ్య పాల్గొన్నారు.



సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పూర్ణచందర్‌రాజు

ఆత్మకూరు(ఎం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన పి.పూర్ణచందర్‌రాజు సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆదివారం సికింద్రాబాద్ మౌలాలిలో జరిగిన సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఎన్నికల్లో పూర్ణ చందర్‌రాజు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనట్లు తెలిపారు. రాజు ఎంపిక పట్ల మండల సీనియర్ సిటిజన్లు అభినందనలు తెలిపారు.

పూర్వవిద్యార్థుల ఆర్థికసాయం

ఆత్మకూరు(ఎం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తోటి మిత్రుడి అకాల మరణంతో, అతని కుటుంబానికి బాల్య మిత్రులు ఆర్థికసాయం చేశారు. మోటకొండూరు మండలం తేర్యాల గ్రామ మాజీ సర్పంచ్ వంజాల సత్యనారాయణ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. అతని చిన్న నాటి మిత్రులు.. ఆత్మకూరు(ఎం) హైస్కూల్‌కు చెందిన (1992-1993) పదో తరగతి విద్యార్థులు తమ వంతు సహకారంగా రూ.50వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు(ఎం) తాజా మాజీ సర్పంచ్ జె.నగేష్, గుండ్ల భిక్షపతి, కట్టెకోల శ్రీను, పాశం అనంతరెడ్డి, బండారు సత్యనారాయణ, ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతికి వార్షికోత్సవ శుభాకాంక్షలు

అక్షరమే అయుధంగా ప్రజల పక్షాన నిరంతరం
పోరాడుతున్న ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, సిబ్బందికి
23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

శ్రీనివాస మెడికల్ & జనరల్ స్టోర్స్
కెమిస్టు & డ్రగ్గిస్టు, ఆలేరు

విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది
ఆలేరు

చిరు వ్యాపారులకు శాశ్వత మడిగెలు నిర్మించాలి

● ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఇమ్రాన్

భువనగిరి గంజ్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పట్టణంలోని నిరుపేదలకు శాశ్వత మడిగెలు నిర్మించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఇండీ ఇమ్రాన్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని జగదేవ్‌పూర్ చౌరస్తాలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డిని ఏఐటీయూసీ నాయకులు కలిసి వినతిపత్రం అంజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సామల శోభన్ బాబు, గుర్రాల శ్రీను, మంద బాబు, ఎండీ జియావొద్దిన్, కిషన్, లాల్, స్వప్న, ఎండీ ఖలీల్, గుర్రాల పాండు, సామల జంగయ్య, ఎండీ సాజిత్, అంజనేయులు, హిరేకర్ చోటు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.











